



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

సోమవారం 16 జూన్ 2025 - పేజీలు 8

మన పార్టీ నాయకులెవరు అమరావతి రాజధాని గురించి మాట్లాడవద్దు మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల వ్యవహారంతో కాక పుట్టించిన జగన్ ఇప్పుడు ఆ పార్టీ నాయకులకు రాజధాని గురించి మాట్లాడవద్దని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజధాని వ్యవహారంలో వైకాపా వ్యవహరించిన తీరుకు ఆ పార్టీ కొంప మునిగిపోయింది. తీవ్ర వ్యతిరేకత వచ్చి ఓటమిపాలైంది. రానున్న 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి అమరావతి రాజధానిపై ఎలాంటి వ్యతిరేకత లేదని చెప్పుకోవటానికి జగన్ ఇలాంటి వ్యూహం పన్నినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికీ తరచూ వైకాపా నేతలు అమరావతి రాజధానిపై మాటల తూటాలు పేలుస్తూనే ఉన్నారు. అయితే రాజధాని విషయంలో విధానపరమైన నిర్ణయాల్లో వైసిపి తీరు మాత్రం ఏమాత్రం మారలేదు. ఇటీవల అమరావతి రాజధాని ప్రాంతంలో కూటమి ప్రభుత్వం  పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం, అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన రావడంతో వైకాపా తన విధానాలను ఎలా స్టాండ్ చేసుకోవాలో తెలియక సతమతమవుతోంది. దీనిపై ముందుగా ఎవరూ మాట్లాడి అనవసర రాద్ధాంతం చేయవద్దని ఆదేశించినట్లు చెబుతున్నారు. ఇటీవల అమరావతి రాజధాని వ్యవహారంపై తన సొంత మీడియాకు చెందిన ప్రతినిధులు అమరావతి మహిళలపై చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున దుమారం లేపాయి. దీనిపై కొంతమంది పోలీసుల కేసుల్లో కూడా ఇరుక్కున్నారు...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక
సూర్య బ్యూరో

## అమరావతి మీద
# మాట్లాడొద్దు..?

- జగన్ హుకుం?
- మనం మాట్లాడితే కొంప మునిగే ప్రమాదం ఉంది
- గత ఎన్నికల్లో దెబ్బ తిన్నాం
- అమరావతి రాజధాని వ్యవహారంలో ఇప్పటికైనా వైకాపా సక్రమంగా వ్యవహరిస్తుందా



అదే సమయంలో అమరావతి రాజధాని విషయంలో తమ స్టాండ్ ఏంటో బయటకు చెప్పకుండానే 2029 ఎన్నికలను ఫేస్ చేయాలన్నది జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అమరావతి రాజధాని అన్నది వైసీపీని ఎంతగానో ఇబ్బంది పెట్టింది అని చెప్పాల్సి ఉంటుంది. అమరావతి ప్లేస్‌లో మూడు రాజధానులు అని 2019 నుంచి 2024 మధ్యలో అధికారంలో ఉన్న వైసీపీ తనదైన రాజకీయ విధానాన్ని ఎంచుకుంది. అయితే 2024 ఎన్నికల్లో వైసీపీ భారీ ఓటమి చెందడం జరిగింది. అదే సమయంలో కేవలం పదకొండు సీట్లు మాత్రమే వైసీపీకి దక్కాయి. ఈ క్రమంలో వైసీపీ గత ఏడాది విధానపరమైన అంశాలలో పెద్దగా స్పందించడం లేదు. అయితే ఇటీవల వైసీపీకి చెందిన మాజీ మంత్రి ఒకరు అమరావతి రాజధాని విషయంలో తమ విధానం వల్ల కూడా ఓటమి పాలు అయ్యాయమని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే అమరావతి మీద వైసీపీ స్టాండ్ ఏమైనా మారిందా అన్న చర్చ కూడా ఆ తరువాత మొదలైంది. కానీ అమరావతి విషయంలో వైసీపీ అయితే తన విధానాన్ని అలాగే కొనసాగిస్తోందని జగన్ ఈ మధ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఉన్నాయని అంతా అనుకున్నారు. అమరావతి రాజధాని కోసం అయిదారు వందల ఎకరాలు తీసుకుని నిర్మిస్తే సరిపోతుంది కదా అని జగన్ అన్నారు. పైగా గుంటూరు విజయవాడల మధ్యన అని కూడా ప్లేస్ చెప్పారు. ఇక వైసీపీ తీరు చూస్తే భారీ ఎత్తున లక్షల ఎకరాలు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి అమరావతి రాజధానిని నిర్మించాల్సిన అవసరం లేదన్న భావన ఉందని అంటున్నారు. ఏపీ సమగ్రమైన అభివృద్ధి అన్నదే వైసీపీ విధానం అంటున్నారు. లక్షల కోట్లు ఒకే ప్రాంతం పైన కుమ్మరించడం ద్వారా సంపద సృష్టి జరిగేది ఉండదు సరికదా ప్రాంతీయ వివక్ష వస్తుందని కూడా వైసీపీ భావిస్తోంది అన్నది కూడా అంటున్నారు.

మరో వైపు చూస్తే 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. కేవలం అమరావతి రాజధాని విషయం కాదని అంటున్నారు. అదే నిజమైతే ఉత్తరాంధ్రా రాయలసీమ రీజియన్ లో కూడా వైసీపీకి సీట్లు ఏవీ రాలేదని గుర్తు చేస్తున్నారు. అందువల్ల ఓట్లు పెద్ద ఎత్తున పెరగడం ఈవీఎంల వల్లనే ఓటమి సంభవించింది అని జగన్ భావిస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. మరో వైపు చూస్తే చంద్రబాబు నాయకత్వంలోని మిగతా 3వ పేజీలో

## హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోలుకు
# రూ.150 కోట్లు సాయం చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన సీఎం
- సీఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి భేటీ
- ఆక్వా ఎగుమతులపై సుంకాల భారం తగ్గించేలా అమెరికాతో చర్చించండి
- మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీ తగ్గించండి
- పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచన చేయండి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్రంలోని వివిధ వాణిజ్య పంటలు, ఆక్వా రైతుల కష్టాలపై సీఎం చంద్రబాబు–కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మధ్య జరిగిన భేటీలో కీలక చర్చ జరిగింది. ఏపీ పర్యటనకు వచ్చిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు.. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులపై అమెరికా సుంకాల విధింపు, మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీ తగ్గింపు వంటి అంశాలపై ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఆయా అంశాలపై రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను.. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. అలాగే ఈ ఇబ్బందులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వ మిగతా 3వ పేజీలో



## ఏపీలో 18 ఏళ్లు నిండిన మహిళలకు
# కొత్త పథకానికి శ్రీకారం

- 18 ఏళ్లు పైబడిన మహిళలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త
- త్వరలోనే ఈ పథకం అమలు
- వారి ఖాతాల్లో నెలకు 1500 చొప్పున సంవత్సరానికి రూ.18000 జమ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

త్వరలోనే మరో పథకాన్ని ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెడీ అవుతోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని మహిళలకు శుభవార్త చెప్పింది. 18 ఏళ్లు నిండిన మహిళల ఖాతాలో రూ.18 వేలు జమ చేసేందుకు సిద్ధం అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న మిగతా 3వ పేజీలో

## ఈనెల 20న మెగా వైద్య శిబిరం

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని వైష్ణవి కళ్యాణ మండపంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రతినిధులు తెలిపారు. లక్ష్మీ ఆరుష్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ స్టార్ హాస్పిటల్స్ వైద్యుల సహకారంతో జరిగే ఈ వైద్య శిబిరంలో కార్డియాలజీ, పల్మనాలజీ, పిడియాట్రిక్స్,కార్డియో థొరాసిక్ సర్జరీ, ఆప్తమాలజీ,ఆర్థోపెడిక్స్,న్యూరాలజీ, జనరల్ వైద్య సేవలు అందించడం జరుగుతుంది. రోగులకు అవసరమైన టూడీ ఎకో, ఈసీజీ,షుగర్,బీపీ,న్యూరో పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నారు. గుండె పరీక్షలు చేసి అవసరమైన వారికి యాంజియో గ్రామ్,స్టెంట్ లతో పాటు క్లిష్టమైన గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు ఎన్.టీ.ఆర్. వైద్య సేవ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితంగా చేయనున్నారు. ముందస్తు నమోదు కొరకు సెల్: 87122 72928, 77023 33121లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## బ్రహ్మానంద రెడ్డికి జాతీయ పర్యావరణ అవార్డు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం బెంగళూరు టౌన్ హాల్లో జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ పర్యావరణ అవార్డుల మహోత్సవ సభలో నిడమర్రుకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఇన్చార్జ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి జాతీయ పర్యావరణ అవార్డు అందుకున్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదగా బ్రహ్మానంద రెడ్డి అవార్డు అందుకున్నారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుట వంటి కార్యక్రమాలతో పాటు పలు ధార్మిక, సేవ కార్యక్రమాలు నిర్వహించి విశిష్ట సేవలందించినందుకు గాను బ్రహ్మానంద రెడ్డికి జాతీయ పర్యావరణ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ జాతీయ పర్యావరణ అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో పర్యావరణం పరిరక్షణ కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పర్యావరణ సంస్థ చైర్మన్ విజయరాజు ధమాల్, కర్ణాటక జాతీయ పర్యావరణ సంస్థ అధ్యక్షులు ఏ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

## మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని,ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని మంగళగిరి రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు భూదందాలు, దౌర్జన్యాలు, అసాంఘిక చర్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. గ్రామాల్లో విద్వేషాలు సృష్టించరాదని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకవేళ గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పిడి యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా రౌడీషీటర్లు భూ దందాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ముగిసిన రోటరీ కృత్రిమ కాళ్ల పంపిణీ

### ప్రాజెక్టు శ్రీ పాదంతో 128 మంది దివ్యాంగుల జీవితాలలో కొత్త వెలుగు

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదవ తేదీ నుంచి జరుగుతున్న రోటరీ కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మూడవ రోజు 35 మంది దివ్యాంగులకు 'ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్ళను అమర్చారు. మంగళగిరి వీ టి జె ఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కాలేజీ ఆడిటోరియం లో జరిగిన ముగింపు ఉత్సవంలో రోటరీ జిల్లా 3150 గవర్నరు శరత్ చౌదరి ప్రసంగించారు. ఈ శిబిరంలో మొత్తం 128 మంది దివ్యాంగులకు, ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్ళను అమర్చడమే కాకుండా వారికి ఈ కాళ్ళను ఉపయోగించి నడవడం, మెట్లు ఎక్కడం, కాలు ముడుచుకొని కూర్చోవడం వంటివి నేర్పించడం జరిగిందన్నారు. ప్రాజెక్టు శ్రీ పాదం 128 మంది దివ్యాంగులు మెరుగైన జీవితం గడిపేందుకు




కారణమైందని, సాధారణ కృత్రిమకాళ్ళకంటే ఈ ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్ళు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు బాలకోటి రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ డైరెక్టర్ త్రిపురనేని మురళి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందె మురళీ మోహన రావు, ప్రాజెక్టు ఛైర్మన్ అనిల్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు పారేపల్లి నిరంజన్ గుప్తా వడ్లమూడి శ్రీనివాసరావు, చనుమోలు గోపాల్, ప్రెగడ రాజశేఖర్, అందె రేవంత్ కుమార్, మాయకుంట క్రాంతి కుమార్, మునగపాటి నాగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా శాంతి కల్యాణం





**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల రైలు పేట మార్కెట్ యార్డ్. వద్దగల శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఘనంగా శాంతి కళ్యాణం ను నిర్వహించారు. గ్రామానికి చెందిన శరత్ చంద్ర చౌదరి సుజాత దంపతులు స్వామివారి కళ్యాణ పూజలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్రల ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీం ్ధప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు సాకేత్ శర్మ మాట్లాడుతూ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు ప్రతినెల శ్రావణ నక్షత్రం ముందు స్వామివారి శాంతి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతినెల భక్తుల కోరిక మేరకు యాగాలు అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం స్వామివారి యొక్క మూల మూర్తికి శుక్రవారం అభిషేకం ఎంతో అత్యంత వైభవంగా గ్రామంలో జరుపుకోవడం ఎంతో విశేషం అన్నారు .గత రెండేళ్లుగా ప్రతి శ్రావణ నక్షత్రం రోజున 500 మందితో జరుపుకోవడం ఎంతో మహా భాగ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# గుంటూరులో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** జమాతే ఇస్లామీ హింద్ గుంటూరు నగర శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని బ్రాడీపేట పదో లైన్ లో గల పెన్షనర్స్ భవన్లో ఆదివారం ఈద్ మిలాప్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన



జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని ఇక్కడ ఎన్నో మతాలు కలిసిమెలిసి జీవిస్తున్నాయని అలాంటి ఈ దేశంలో ఒక మతం పెత్తనం కోసం కొందరు ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలను మనమందరం కలిసి తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన పటాన్ ఖాసింఖాన్ మాట్లాడుతూ ఈమధ్య జరిగిన పండుగ బక్రీద్ సందేశాన్ని వినిపిస్తూ ప్రపంచంలోని మానవులందరూ ఒకటే అని, వారందరి తల్లిదండ్రులు ఒకటే అని, వారందరి సృష్టికర్త ఒకటే అని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షులు యాసీన్, బాపట్ల జమాత్ ఇస్లామీ జిల్లా అధ్యక్షులు సుభాన్, నగర మీడియా ఇన్చార్జి షేక్ ముస్తఫా కార్యక్రమానికి పర్యవేక్షణగా బాధ్యతలు నిర్వహించగా, అతిథులందరికీ విందు ఏర్పాటు చేసి ఈద్ మిలాప్ ఘనంగా నిర్వహించారు.

## ఎన్ఎస్పి కాల్వలో పూడికతీతలు, వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే నాటికి మేజర్, మైనర్ కాలువల పూడికతీతలు, వ్యర్థాలను తొలగించి చివరి ఎకరా వరకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సుబ్బాయపాలెం నుండి పాత మాగులూరు వరకు ఎల్ఎస్పీ కాలవలో పూడికతీతలు, వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాలు చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి మేలు జరిగే పనుల్లో ఉదాసీనత, నాణ్యతలో రాజీ ఉండొద్దన్నారు. కూటమి ప్రభుత్వానికి వరుణుడు కూడా అండగా ఉన్నారని వివరించారు. మే నెలలో వర్షాలు పడటం, జూన్ నెలలో పై రాష్ట్రాలలో జలాశయాలన్నీ కళకళలాడుతూ ఉండటం శుభసూచికమన్నారు. ఈ ఏడాది ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుందని ఇది రైతులకు మేలు చేసే అంశం అన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి కార్యకర్తలు, ఎన్ఎస్పి అధికారులు తదితరులున్నారు.



# యోగ జీవితంలో భాగమవ్వాలి

- మానసిక, శారీరక ఆరోగ్యం యోగతోనే సాధ్యం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- వాసవి క్లబ్ ఆధ్వర్యంలో యోగ పోటీల నిర్వహణ




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ప్రతి ఒక్కరూ యోగాని జీవన విధానంలో భాగం చేసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. గుంటూరులోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఓంకార్ యోగ ఫౌండేషన్ సహకారంతో యోగ కాంపిటేషన్స్ నిర్వహించారు కార్యక్రమానికి నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకో బోతున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా యోగ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో అందరికీ ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోయిందని చెప్పారు. దీని కారణంగా బీపీలు షుగర్ లు వచ్చేస్తున్నాయని తెలిపారు. సరైన యోగా సాధన ద్వారా అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా నేర్చుకోవడం సంతోషకరమని చెప్పారు. మనిషికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ప్రధానమైందని, యోగ ద్వారా ఇది సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు.

# బాబు + పవన్ - కార్యకర్తలు = కూటమి ..!

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



ఇది అంతర్గతంగా కార్యకర్తలపై ప్రభావం చూపుతోంది. నాయకులను బట్టే కార్యకర్తలు పనిచేస్తారు. నాయకులు ఎలా ఉంటే కార్యకర్తలు కూడా అలానే ఉంటారు. కూటమి బలంగానే ఉంది. ఏడాది పాలన తర్వాత కూడా.. ఎక్కడా పైకి విభేదాలు కనిపించలేదు. కనిపించడమూ లేదు. దీనికి ప్రధాన కారణం.. చంద్రబాబు ం పవన్ కల్యాణ్‌లు బలంగా ముందుకు సాగుతుండ డమే. బీజేపీ కూడా కూటమిలోనే ఉన్నప్పటికీ.. ఆ పార్టీకి ఉన్న ప్రాధాన్యం అందరికీ తెలిసిందే. ఇక, ప్రధానంగా ముఖ్యమంత్రి=ఉప ముఖ్యమంత్రి మాత్రమే పార్టీలకు అతీతంగా ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారు. అయితే.. ఇది పైకి కనిపిస్తున్న వాస్తవం. క్షేత్రస్థాయిలో మాత్రం కార్యకర్తల మధ్య కలివిడి కనిపించడం లేదు. ఎవరూ ముందుకు రావడం లేదు. చేతులు కలపడమూ లేదు. క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని.. పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఏడాది పాలన తర్వాత.. సంబరాలు చేయాలని అన్నారు. అయితే.. ఎవరికి వారుగా కార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లి గూడెంలో ఎమ్మెల్యే సింగిల్‌గా మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి టీడీపీ నుంచి ఎవరినీ పిలవలేదని ప్రచారం జరుగుతోంది. ఇక, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ.. టీడీపీ నాయకులు ఒంటరిగా పనికానిచ్చారు. ఇక్కడ జనసేన నుంచి పెద్దగా ఎవరికీ ఆహ్వానాలు అందలేదు. ఈ పరిణామాలను గమనిసిస్తే.. ఏడాది తర్వాత కూడా పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదన్నది విశ్లేషకులు చెబుతున్న మాట. అంతేకాదు.. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోవాలని పార్టీ నాయకులు చెబుతున్నా.. అది చెప్పడం వరకే పరిమితం అవుతోంది. సీమ విషయానికి వస్తే.. ఇక్కడకూడా దాదాపు అంతే.. అనాల్సి వస్తోంది. ఇది అంతర్గతంగా కార్యకర్తలపై ప్రభావం చూపుతోంది. నాయకులను బట్టే కార్యకర్తలు పనిచేస్తారు. నాయకులు ఎలా ఉంటే కార్యకర్తలు కూడా అలానే ఉంటారు. దీనిలో తేడా లేదు. సో.. ప్రస్తుతం కూటమి అంటే.. చంద్రబాబుంపవన్ కల్యాణ్ అన్నట్టే ఉంది తప్ప.. కార్యకర్తలు కలివిడిగా మాత్రం ఉండడంలేదు. ఎవరికి వారుగానే ఉంటున్నారు. ఏ విషయాన్నయినా.. నాయకులు సీరియస్‌గా తీసుకోవడం లేదన్నది కూడా గమనార్హం. సో.. ఎలా చూసుకున్నా.. కూటమి బాగానే ఉంది. కానీ, అంతర్గతంగానే వివాదాలు ముదురుతున్నాయి.

# హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోలుకు రూ.150 కోట్లు సాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పరంగా తీసుకుంటున్న చర్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన సీఎం చంద్రబాబు ఈ అంశాల్లో కేంద్ర సహకారాన్ని కోరారు.

**హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లకు రూ.150 కోట్లు ఇవ్వండి**

ప్రస్తుత సీజన్‌లో హెచ్డీ బర్లీ, వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ధరలు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. పొగాకు కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలను ప్రారంభించిందని తెలిపారు. దీంట్లో భాగంగా రూ.300 కోట్ల వ్యయంతో 20 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు సీఎం వెల్లడించారు. ఈ మేరకు బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 7 కొనుగోలు కేంద్రాలను ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసినట్టు వివరించారు. కొనుగోళ్ల కోసం రూ.150 కోట్లను టొబాకో బోర్డు ద్వారా వ్యయం చేసేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఏపీలో 1.31 లక్షల హెక్టార్లల్లో పొగాకు సాగు చేశారని గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లో పొగాకుకు డిమాండ్ తగ్గడంతో ధరల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్‌ను టొబాకో బోర్డు పరిధిలోకి తెచ్చేలా చట్టాన్ని సవరించాలని సీఎం చంద్రబాబు కోరారు.

**క్రూడ్ పామాయిల్‌పై సుంకం తగ్గింపు గురించి పునరాలోచన చేయండి:**

క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంతో పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదని వివరించారు. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం విషయంలో పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. సుంకం తగ్గింపుతో కేంద్రం నిర్దేశించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యాలను చేరుకోలేమన్న విషయాన్ని గమనించాలని చంద్రబాబు సూచించారు.

**ఆక్వా రైతులను ఆదుకోండి:**

ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల వల్ల ఏపీలోని 8 లక్షల ఆక్వా రైతులు నష్టపోతున్నారని కేంద్రమంత్రికి సీఎం చంద్రబాబు తెలిపారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధించిన 27 శాతం సుంకాన్ని తగ్గించేలా ఆ దేశ అధికారులతో మాట్లాడాలని కోరారు. ఆక్వా రైతులపై ఈ టారిఫ్ భారం తగ్గించి సంక్షోభం నుంచి బయటపడేసేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. అమెరికా విధించిన సుంకాల వల్ల ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి దారులు సంక్షోభంలో పడ్డారని ముఖ్యమంత్రి వివరించారు.

**మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీని తగ్గించండి:**

మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సీఎం చంద్రబాబు కోరారు. మామిడి తాండ్రపై 5 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, అదే తరహాలో మ్యాంగో పల్ప్‌కు కూడా వర్తింపచేయాలని సూచించారు. జీఎస్టీ తగ్గిస్తే మామిడి రైతులకు, పల్ప్ పరిశ్రమలకు ప్రయోజనం చేకూరు తుందన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్టు సీఎం చంద్రబాబు పీయూష్ గోయల్‌కు వివరించారు. సీఎం చంద్రబాబు చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని పొగాకు, పామాయిల్, మామిడి రైతులకు మేలు కలిగేలా చర్యలు చేపడతామని అన్నారు. భేటీ అనంతరం కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు శాలువాతో సత్కరించి.. జ్ఞాపికను అందచేశారు.

## అమరావతి మీద మాట్లాడొద్దు..?

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం కేవలం అమరావతినే పట్టుకుని అక్కడే వేలాది కోట్లను పెట్టడం వల్ల మిగిలిన ప్రాంతాలలో వ్యతిరేకత వస్తోందని వైసీపీ అధినాయకత్వం అంచనా వేస్తోంది అని అంటున్నారు అంతే కాదు అమరావతి కోసం అంటూ ఇప్పటికే 33 వేల ఎకరాలను తీసుకున్నారని దానిని ముందు ఒక లెక్కకు తీసుకుని రాకుండా ఇంకా మరో 44 వేల ఎకరాలను సేకరించడం వంటివి మంచి నిర్ణయం కాదని భావనలో ఉన్నారని చెబుతున్నారు. ఇక చంద్రబాబు అండ్ కో చెబుతున్నట్లుగా అమరావతి రాజధాని అన్నది కేవలం నాలుగేళ్ళలో పూర్తి అయ్యేది కాదని అందువల్ల 2029 నాటికి కూడా అది అలాగే ఉండే చాన్స్ ఉందని కూడా ఆలోచిస్తున్నట్లుగా ఉందని అంటున్నారు. దాంతో అమరావతి రాజధాని విషయంలో కూటమి తీసుకున్న నిర్ణయాలను రానున్న కాలమంతా పరిశీలించడమే కాకుండా వాటి మీద జనంలో వచ్చే రియాక్షన్స్ ని గమనిస్తూ ముందుకు సాగాలన్నదే వైసీపీ రాజకీయ విధానం అని అంటున్నారు. అదే సమయంలో అమరావతి రాజధాని విషయంలో తమ స్టాండ్ ఏంటో బయటకు చెప్పకుండానే 2029 ఎన్నికలను ఫేస్ చేయాలన్నది జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అందుకే అమరావతి విషయంలో ఎవరూ బయటకు మాట్లాడవద్దు అన్నది ఆయన ఆదేశించారని ప్రచారం అయితే సాగుతోంది. ఇక అవసరమైనపుడు సరైన సమయంలో పార్టీ స్టాండ్ ఏంటి అన్నది తాను మాత్రమే ప్రకటిస్తాను అని పార్టీ నేతల వద్ద జగన్ అన్నట్లుగా చెబుతున్నారని ప్రచారం సాగుతోంది. మరో వైపు ఏంటి అంటే వైసీపీది వికేంద్రీకరణ విధానమే అని అంటున్నారు. ఏపీ సమగ్ర అభివృద్ధి వెనకబడిన ప్రాంతాలలో కూడా అభివృద్ధి అన్నదే పార్టీ స్టాండ్ అని అంటున్నారు. మొత్తానికి అమరావతి రాజధాని విషయంలో వైసీపీ నేతలు ఎవరూ మాట్లాడవద్దు అని పార్టీ హుకుం జారీ చేసింది అని అంటున్నారు.

## ఏపీలో 18 ఏళ్లు నిండిన మహిళలకు కొత్త పథకానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని ద్వారా రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఆర్థిక సాయం అందించేందుకు రెడీ అయ్యింది. అర్హులైన ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా 18–59 ఏళ్ల మధ్య వయసు ఉన్న అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.1500 నేరుగా వారి ఖాతాలో జమ చేయనున్నారు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ పథకం అమలు కోసం 2024-2025 బడ్జెట్‌లో రూ.3,341.82 కోట్లు నిధులు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ మొత్తంలో బీసీ మహిళలకు రూ.1069.78 కోట్లు కేటాయించగా.. మిగిలిన మొత్తంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళల కోసం రూ.629.37 కోట్లు, అలానే మైనారిటీ ఆడబిడ్డలకు రూ.83.79 కోట్లు, మిగతా మొత్తంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళల కోసం కేటాయించింది. ఈ పథకానికి అర్హులైన వారు అధికారిక వెబ్‌సైట్: https://ap.gov.in/aadabiddanidhi ను సందర్శించి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే అధికారిక వెబ్‌సైట్ ఇంకా అందుబాటు లోకి రాలేదు.

## కేంద్ర మంత్రిని కలిసిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరులోని టొబాకో బోర్డ్ కార్యాలయానికి ఆదివారం విచ్చేసిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మొక్కను బహుకరించారు. అనంతరం ఆయనకు స్వాగతం పలికారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

### నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



**మాచర్ల, మేజర్ న్యూస్ :** పల్నాడు ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయాలు అన్నారు.ఆదివారం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన కారంపూడి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నం హాస్పిటల్ మరియు ఆర్కా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్ ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయాలు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించిన అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో వైద్య సేవలకు నోచుకొని పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని ముందుకు వచ్చిన నిర్వాహకులను అభినందించారు.రాబోయే రోజుల్లో పల్నాడు జిల్లా లోని ప్రతి మండల కేంద్రంలో ఇలాంటి మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి పేదప్రజల కు అండగా నిలుస్తామని ఆయన అన్నారు.మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తోనే ప్రజలకు అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి అని అన్నారు.మనిషి శరీరం లో ప్రతి అవయవం ముఖ్యమే అని ఏ అవయవం పనిచేయకపోయినా మనిషి ప్రాణానికే ప్రమాదం అని అన్నారు.నియోజకవర్గం లో అభివృద్ధి , సంక్షేమం తో పాటు ప్రజల ఆరోగ్య భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనేదే తన లక్ష్యం అని ఆయన అన్నారు. ఈ క్యాంపు కు ఆర్గనైజర్ గా వ్యవహరించిన ఉన్నం హాస్పిటల్ అధినేత ఉన్నం నాగమల్లిఖార్జునరావు మాట్లాడుతూ కారంపూడి ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో మున్ముందు మరిన్ని హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని అన్నారు. ఈ రోజు క్యాంప్ లో 1236 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరు అంజయ్య, పంగులూరు పుల్లయ్య, గోళ్ల సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ,బోల్నేడి శ్రీనివాసరావు,చప్పిడి రాము,మునుగోటి సత్యం,గాడిపర్తి రమాదేవి,బొమ్మిన శేషగిరి,సరస్వతి బాలూ నాయక్,కటికల బాలకృష్ణ,తండా మస్తాన్ జానీ, ఏచూరి శంకర్,లింగా రమేష్,జానకి రామయ్య , డాక్టర్లు ఉన్నం దీపిక,రాజు నాయుడు,హేమంత్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్టీఓ కుమార్‌కి చిరు సన్మానం



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి నుండి పెదకూరపాడు ట్రెజరీ ఆఫీసునకు బదిలీ అయినా ఎస్ టి ఓ బీఆర్ కె కుమార్ కి వీడ్కోలు పలుకుతూ వారి సేవలను కొనియాడుతూ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.బీ ఆర్.జె ప్రసాద్, గద్దె మురహరిరావు, దాసరి శృంగారం, పి.వెంకటేశ్వర రావు, అంకాళ్ల ప్రభుదాస్, అంబేద్కర్, నారాయణ, ఇబ్రహీం, మహంకాళి పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ అశోక్ కుమార్



**మాచవరం మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం పిల్లుట్ల గ్రామంలో గార్లపాటి రమేష్–నాగబాల కుమార్తె హెప్సిబా పుష్పాలం కరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన వైయస్ఆర్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డా. చింతలపూడి అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ చింతా రెడ్డి నిర్మల పుల్లారెడ్డి , సర్పంచ్లు బిట్ర కరుణమ్మ, డేవిడ్, మాచవరం సర్పంచ్ రాగిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా బి.సి. సంక్షేమానికి కృషి చేసిన కేసన శంకరరావు

## కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

**తెనాలి, మేజర్ న్యూస్ :** పార్టీలకతీతంగా బిసి సంక్షేమం కొరకు కృషి చేస్తూ బిసిల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత కేసన శంకరరావుకు దక్కుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తెనాలి పౌర సంఘం ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావుకు బి.సి. బంధు బిరుదును ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ పెమ్మసాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ శంకరరావురాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా బి.సి.ల సమస్యలను వారి దృష్టికి తీసుకుని వెళ్ళి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి కేసన శంకరరావు అని అన్నారు. నాణ్యమైన విద్య అందుబాబులో లేకపోవడం, ఆర్థికంగా వెనుకబడటం ఇత్యాది కారణాల వల్ల బి.సి.లు వెనుకపడ్డారని పేర్కొన్నారు. నీతినిజాయితీలతో రాజకీయాలు చేయడం అంటే దాదాపు అసంభవం అనే స్థాయికి కొందరు రాజకీయాలను తీసుకుని వచ్చారని అన్నారు. ఆ కాలంలో బి.సి. లకు విద్యను బోధించిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే లను ఊరి నుండి వెళ్ళగొడితే ముస్లింలు ఫాతిమా షేక్, ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి ఆశ్రయమిచ్చి అండగా ఉన్నారని, నేడు కులాలు, మతాలు అని కొట్టుకోవడం విచారకరమన్నారు. బి.సి. లలో ఎవరైనా ఐఏఎస్, ఐపిఎస్లు ఉన్నప్పటికీ వారు కాలగతిన ఉన్నతస్థాయి వారితో కలసిపోతున్నారన్నారు. విద్యలో సంస్కరణలు పెరిగినప్పుడే జ్ఞానం పెరుగుతుందని, ఎవరైనా సరే చదువుకుంటేనే ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి చేరుకోగలరచి డాక్టర్ పెమ్మసాని అన్నారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ బలహీనవర్గాల వారి



సమస్యల పరిష్కారం కోసం అనేక త్యాగాలు చేసి మన ప్రాంతానికి మంచి పేరు తెచ్చిన వ్యక్తి శంకరరావు అని అన్నారు. రిజర్వేషన్లు, బి.సి. సాధికారికత, సంక్షేమం కోసం చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయవలసిన సందర్భం ఇది. ఏ విధంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామనేది కూడా సమీక్షించుకోవాలి. బి.సి.ల కోసం కేటాయించిన నిధులు దారిమళ్ళకుండా బి.సి.ల సంక్షేమానికే ఉపయోగపడేలా గమనించవలసిన అవసరం ఉంది అని మనోహర్ అన్నారు. మరో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన వారమైనా బలహీనులం కాదు, ఆత్మగౌరవానికి భంగం కలిగితే వెనుకడుగు వేయం అని ముందుకు సాగిన వ్యక్తి శంకరరావు అన్నారు. జనగణనతో పాటు కులగణన కూడా జరగాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శంకరరావు పలుమార్లు ధర్నాలు చేసి ప్రధానమంత్రి మోడి దృష్టికి తీసుకుని వెళ్ళారని సత్యకుమార్ యాదవ్ ప్రశంసించారు. మరో రాష్ట్రమంత్రి కె. పార్థ సారథి మాట్లాడుతూ ఏ ప్రాంతానికి చెందిన బలహీన వర్గాల వారైనా విధాన పరమైన సమస్యలతో సతమతమౌతున్నప్పుడు వాటి పరిష్కారానికి శంకరరావు పోరాటం చేసేవారని అన్నారు. కేసన శంకరరావు జీవిత విశేషాలతో రూపొందిన 'జయహో బి.సి. బంధు కేసన శంకరరావు' పేరుతో అభినందన సంచికను డాక్టర్ పెమ్మసాని ఆవిష్కరించారు. జొన్నాదుల నరసింహారావు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జాని, ఓంకార్ ప్రసాద్ ఈ అభినందన సంచికకు సంపాదకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఓబిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్, కన్నా మాస్టార్, రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ అన్నవరపు నాగమల్లేశ్వం రావు, బి. శ్రీనివాసరావు, జగన్నాధరావు, కోలా అశోక్, శివరాం బాలాజీ, టి. బ్రహ్మానంద శర్మ, వీరంకి రంగారావు తదితరులు ప్రసంగించారు. ప్రారంభంలో జెల్లి గంటయ్య ప్రార్థనాగీతం ఆలపించగా సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమానికి ఫణీంద్ర స్వాగతం పలికారు. కార్యక్రమంలో జొన్నాదుల వెంకటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, ఈ. సుబ్బారెడ్డి, వేముల కృష్ణ, మహమ్మద్ బేగ్, చావా సాంబశివరావు, గుంటూరు కోటేశ్వరరావు, కుర్రా శ్రీను, హరిదాసు గౌరీశంకర్, హైమవతి, ఏ.ఏడుకొండలు, చుండూరు శ్రీనివాసరావు, మువ్వా మల్లికార్జునరావు, బూర్లె నరసింహారావు, అద్దేపల్లి సాంబశివరావు, జి. రాంబాబు, వెంకట్రావ్, అక్కల వెంకటేశ్వరరావు, షకీలా, మంజూషా, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర కీలకమని, ఆటపాటలు, చిలిపి పనులు, కష్టసుఖాలు ఇలా ఏదైనా మన వెన్నంటే ఉండి, నేనున్నానంటూ ధైర్యం చెప్పేదే స్నేహం. ఆనందం, బాల్యస్మృతులు, కరచాలనాలు, చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు, గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచిపోయి చిన్న పిల్లల కేరింతలతో సెయింట్ గ్జేవియర్స్ ఉన్నత పాఠశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని మేజర్ పంచాయితీ ముట్లూరు సెయింట్ గ్జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 1985–1986 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పండుగగా జరిగింది. నాలుగు దశబ్దాల తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు, ఎక్కడెక్కడో స్థిర పడిన వారు కొందరు, ఉద్యోగాల్లో

### 40 సంవత్సరాల అ 'పూర్వ' కలయిక

మరి కొందరు, సహదర్మచరినీ లుగా కొందరు, వివిధ స్థితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే తలంపుతో ఆనాటి విద్యార్థులైన కొంతమంది విద్యార్థులకు ఆలోచన కలిగింది. ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు, కుటుంబ పరిస్థితులు, నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు, పాటలు అలరించాయి. అప్పటి తమ పాఠశాల, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, విద్యావిధానం తమ భవిష్యత్తును ఉన్నత స్థాయిలకు చేర్చాయని వారు సంతోషంగా గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువుల గొప్పతనాన్ని కొనియాడుతూ అప్పటి ఉపాధ్యాయులు జి.ప్రేమయ్య, అంతయ్య, యం.జోజయ్య, సుందర్రావు, ఎన్.అప్పారావు, శౌరయ్య, ఇన్నారెడ్డి లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదివిన పాఠశాలను మరువరాదని, చదువుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులను గుర్తించి వారికి తగిన విధంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రారంభంలో వీరితో కలిసి చదువుకుని మృతి చెందిన విద్యార్థుల ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో పొద్దుపోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్యస్థానాలకు వారు కదిలారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుంచాల శివయ్య, పాలా శ్రీను, అల్లం శివనాగేశ్వరావు, చట్టు యల్లయ్య, చుక్క ఏలీయా, గేరా సత్తయ్య, మొవ్వా సురేష్, రావూరి ఆచారి, ఐనంపూడి అమ్మాజీ, కూరపాటి పద్మజా, ఉండవల్లి వాణి, రజిని, రామాదేవి, ప్రత్తి విజయశ్రీ, గుర్రం సీతారావమ్మా, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల రూప శిల్పి దివంగత సీఎం ఎన్టీఆర్





- కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- తక్కెళ్ళపాడు లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ
- చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు పాలాభిషేకం

**పెదకాకాని, మేజర్ న్యూస్ :** సంక్షేమ పథకాల ఆద్యుడు నందమూరి తారక రామారావు అని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ . సహాయ.మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఆదివారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూతెలుగు ప్రజల గుండెల్లో ఆరాధ్యుడు. ఎన్టీఆర్ అన్నారుమరణం లేని మహా నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. మహిళా శక్తి, వెనుకబడి వర్గాల శక్తిని అన్న నందమూరి తారక రామారావు గుర్తించారన్నారు. రోడ్లపై తిరుగుతూ.. ప్రజలలో ఒకరిగా ఉంటూ.. నలుగురు భోజనం చేస్తూ రాజకీయ నాయకుడు అంటే ఇలా ఉండాలి.. అని నిరూపించిన నాయకుడు అన్న ఎన్టీఆర్ అని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలలోని విద్యావంతులను, మేధావులను, రాజకీయాల్లోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్కు దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ ఎలా అయితే విద్యావంతులను ప్రోత్సహించారో.. ఇప్పుడు నారా లోకేష్ గారు కూడా మాలాంటి ఎంతోమంది విద్యావంతులను, మేధావులను రాజకీయాల్లోకి తీసుకువచ్చారనీ చెప్పారు.చరిత్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు వస్తుంటారు కానీ.. సీఎం గా జగన్ చేసిన అన్యాయం మరొక ముఖ్యమంత్రి చేసి ఉండరని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి చిన్న రోడ్ నుంచి పెద్ద రోడ్డు తేడా లేకుండా అన్ని పాడైపోయాయి. ఉన్న నిధులన్నీ రోడ్ల నిర్మాణాలకి సరిపోయే పరిస్థితి ఏర్పడింది.దొంగ సర్టిఫికెట్లు పెట్టడం, అక్రమ బిల్లులు వసూలు చేయడం వల్ల... మేము ఇవాళ ఆంధ్రులం అంటే ఢిల్లీలో కింద నుంచి పై దాకా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం మొత్తం మీద ఒక వంతెన నిధులు వచ్చాక క పూర్తి చేయాలి అంటే కనీసం రెండు సంవత్సరాలు సమయం పడుతుంది. మొట్టమొదటిసారిగా మేము నిధులు సేకరించిన మొదటి ఆరు నెలల్లోనే పనులు ప్రారంభిస్తున్నాం. నెలాఖరులోపు లేదా వచ్చే నెల మొదటి వారంలో నందివెలుగు వంతెన ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైసీపీలో 2019 తర్వాత తెలుగుదేశం వాళ్ళు అనే ఒకే ఒక కారణంతో చిన్న చిన్న కాంట్రాక్టులు చేసిన అందరిని ఇబ్బందులు పాలు చేశారనీ మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో అప్పుల పేరుకుపోయినా.. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఒక ఆంధ్ర ప్రదేశ్ లోనే రూ.4.వేల పెన్షన్లు కూటమి ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. తల్లికి వందనం పేరుతో ఎంతమంది బిడ్డలు ఉన్నా ప్రతి ఇంటికి రూ. 13 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం వాళ్ళ కమిట్మెంట్ కి, ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఎంత కష్టమొచ్చినా వెనకడుగు వేయడం లేదన్నారు. ఇవన్నీ పూర్తి చేయాలంటే సామాన్యమైనటువంటి నాయకులకు అసాధ్యమని ఒక్క నారా చంద్రబాబునాయుడు , లోకేష్ , పవన్ కళ్యాణ్ వంటి నాయకులకే సాక్ష్యం అవుతుంది అని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. మళ్లీ మళ్లీ ఎందుకు చెప్తున్నానంటే దయచేసి అందరూ కడుపునిండాక, పడ్డ కష్టాలను మర్చిపోవద్దని, మన నాయకుడు చేసిన అభివృద్ధిని మర్చిపోవద్దని గుర్తు చేస్తున్నానన్నారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, గురించి నరేంద్ర నేను కలిసి కూర్చుని అంచనాలు వేయించాం. 2019లో వేసిన అంచనాల ప్రకారమే అదే రేటుకు కాంట్రాక్టరును ఒప్పించామన్నారు. తాను నరేంద్ర ఎన్టీఆర్ ఆశయాలను అనుసరిస్తూ ప్రజలకు మేలు చేసేలా అభివృద్ధి జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా సిఎంఆర్ఎఫ్ చెక్కులకు అర్జీ చేసుకున్న వారికి పెమ్మసానీ, ఎమ్మెల్యే ధూళిపాళ్ల కలిసి చెక్కులను అందజేశారు. అలాగే తల్లికి వందనం కార్యక్రమం విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు టిడిపి పార్టీ తరపున ధూళిపాళ్ల, కేంద్రమంత్రి. పెమ్మసాని పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లాం ఫారంలో అమ్మకానికి మిరప విత్తనాలు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ లాం ఫారంలో జూన్ నెల 16 వ తేది (సోమవారం) నుంచి ఎల్.సి ఎ-625, ఎల్.సి ఎ-657, ఎల్.సి.ఎ-643 మిరప రకాల ఫౌండేషన్ విత్తనం అమ్మనున్నట్లు ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ తెలియజేశారు. ఎల్. సి ఎ-643 రకం: పచ్చిమిర్చికి, ఎండు మిర్చికి అనువైన రకము. కాయలు లేత ఆకుపచ్చ రంగులో పొడవుగా (13-14 సెం.మీ) ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు ఎండిన తరువాత కొంచెం ముడత కలిగి ఆకర్షణీయమైన ఎరుపు రంగు కలిగి, బ్యాడగి రకం వలె ఉంటాయి. బాగా బెట్టను తట్టుకొంటుంది, కొంతవరకు జెమిని వైరస్ ను కూడా తట్టుకొంటుంది. అంతే కాక నల్లతామర పురుగు ఉద్ధృతి ఉన్న కూడా కొద్ది పాటి పురుగు మందుల పిచికారితో, అధిక దిగుబడినివ్వ కలిగిన రకము. ఎల్.సి ఎ-625 రకం: ఎండు మిరపకు అనువైన ఈ రకం, మొక్కలు బలిష్టమైన కొమ్మలతో ఎత్తుగా పెరుగుతాయి. కణుపులు దగ్గరగా ఉండి, కాపు చిక్కగా ఉంటుంది. ప్రధాన పొలంలో నేరుగా ఎద పెట్టడానికి మిక్కిలి అనువైన రకం. కాయలు సన్నగా, మధ్యస్థ పొడవుతో (8-10 సెం. మీ ) ఉంటాయి. తేజ రకాన్ని పోలి ఉంటాయి. పచ్చి కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. సూటి రకాలలో కెల్లా అధిక ఘాటు (45000-50000 ఎస్.హెచ్.యు) మంచి ఆకర్షణీయమైన ఎరుపు రంగు (60-65 ఎ.ఎస్.టి.ఏ) కలిగిన రకం. కాయ తోలు పలచగా ఉండి, అధిక ఘాటు వలన కాయకుళు ళ తెగులును కొంతవరకు తట్టుకొని, తాలు కాయలు చాలా తక్కువుగా వస్తాయి. ఎల్. సి ఎ-%657 రకం: తొలకరి తరువాత నేరుగా ఎద పెట్టుకోవడానికి అనువైన జెమిని వైరస్ ను తట్టుకునే రకం. మొక్కలు ఎత్తుగా, దృఢమైన కాండంతో నిటారైన కొమ్మలు కలిగి, బలమైన వేరు వ్యవస్థను కలిగి ఉంటాయి. కాయలు పొడవుగా (11-12 సెం.మీ), ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండినప్పుడు ముదురు ఎరుపు రంగుతో తెల్లటి తొడిమ కలిగి ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు అధిక ఘాటు (50,000-55,000 ఎస్.హెచ్.యు), మంచి రంగును కలిగి ఉంటాయి. అధిక బెట్టను తట్టుకునే రకం. విత్తనాలు కొనదలచిన రైతులు నేరుగా ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ లాం ఫారంలో జూన్ 16 వ తేదీ మొదలు, ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనాలు అందిస్తారు. అయితే స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే పంపిణీ చేస్తారు. రెండో శనివారం, ప్రతి ఆదివారం పంపిణీకి సెలవు ప్రకటించారు. కిలో విత్తనాల ధర 1,200 రూపాయలుగా నిర్ధారించారు. ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ మాట్లాడుతూ, పైన తెలియజేసిన మిరప విత్తనాలు కేవలం ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారం నందు మాత్రమే పొందగలరని, అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మజూపినట్లైతే రైతులు వాటిని ఖరీదు చేసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. దీని కోసం 99898 09554 / 9440592982 ఫోన్ నెంబర్లను సంప్రదించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

## తల్లికి వందనం. అర్హులు, అనర్హుల జాబితా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శన

**గుంటూరు, మేజర్ న్యూస్ :** తల్లికి వందనం పథకానికి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రచురించామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. అర్హులకు సంబంధించిన నగదును వారి తల్లులకు విడుదల చేశామని వెల్లడించింది. “అనర్హత పొందిన లబ్ధిదారులు తమ వివరాలతో గ్రామ సచివాలయ శాఖ వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే తెలియజేశాం. దరఖాస్తుల ఫిర్యాదులను పరిశీలించి, వారు వాస్తవంగా అర్హత కలిగి ఉంటే ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. తల్లిదండ్రులు లేని పిల్లలకు సంబంధించి నగదును సంబంధిత జిల్లా కలెక్టర్ బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నాం. క్షేత్రస్థాయి పరిశీలన చేశాక వారికి కూడా కలెక్టర్ ద్వారా తల్లికి వందనం అందుతుంది. ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన తల్లుల జాబితా పునఃపరిశీలించాక వారికి తల్లికి వందనం నగదు జమ చేయడం జరుగుతుంది” అని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

## తల్లికి వందనం ఏమోగానీ సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త సుమీ

### ఓటిపి చెప్పావా ఉన్నవి కాస్త గోవిందా

**గుంటూరు, మేజర్ న్యూస్ :** తల్లికి వందనం డబ్బులు పడ్డాయా లేదా మేము చెక్ చేసి చెప్తాం ఓటీపీ చెప్పండి అంటూ ఎవరైనా కాల్ చేస్తే మీరు ఎటువంటి వివరాలు వారికి ఇవ్వకండి. ఓటీపీ చెప్పకండి. సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారు జాగ్రత్త. మీకు వివరాలు కావాలి అంటే ప్రభుత్వ వాట్సప్ నెంబర్ కి మెసేజ్ చేయండి లేదా నేరుగా మీ సచివాలయం కి వెళ్లి కనుక్కోండి. జాగ్రత్తగా ఉండండి, మోసపోకండి.

## ఒకే కుటుంబంలో నలుగురికి తల్లికి వందనం . మండల తెలుగు యువత హసన్ వలి



**మాచవరం మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలో తల్లికి వందనం కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన తల్లులుఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేమవరం గ్రామానికి చెందిన గల్లా పిచ్చా హరి కుటుంబంలోని నలుగురు పిల్లలకు తల్లికి వందనం కు అర్హత సాధించారని, కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలుపుతున్నారు. మాచవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీలో కూరపాటి కుటుంబరావు కుటుంబంలోని ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం ద్వారా డబ్బులు జమ కావడం జరిగిందని విద్యార్థుల తల్లి గురవమ్మ ఆనందం వ్యక్తం చేశారు. తురకపాలెం లోని 2 కుటుంబంలలో ముగ్గురు చొప్పున తల్లికి వందనం పథకం వర్తించగా తల్లులు ఆనంద వ్యక్తం చేశారు.మండలంలోని తల్లికి వందనం ద్వారా లబ్ధి పొందిన తల్లులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## డయేరియా నివారణ అవగాహన పోస్టర్ విడుదల



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఐదేళ్ల లోపు చిన్నారులకు వచ్చే డయేరియా నివారణ పద్ధతులు తెలియజేసే గోడ పత్రికలను వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం తెనాలిలో విడుదల చేశారు. ఇంప్లిమెంటేషన్ ఫేజ్ - 2, సోమవారం నుండి జూలై 31వతేదీ వరకు ఆరోగ్య సిబ్బంది డయేరియా నివారణ అవగాహన కార్యక్రమంలో నిర్వహించాలని కోరారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పంపిణీచేస్తూ, ఒక్కొక్కసెంటర్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తెనాలి ఉప జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, నందులపేట యుపిహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ సూపర్వైజర్ వావిలాల సీతారామశాస్త్రి, 104డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.రాఘవకుమార్ పాల్గొన్నారు.

## పివా మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులుగా లక్ష్మీ పెరుమాళ్లు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పివా) మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులుగా తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళు నియమితులయ్యారు. ఆదివారం నగరంలోని షరాఫ్ బజార్ డాంగే కాంప్లెక్స్ ఆవరణలో పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి బ్రాంచ్ సమావేశం అధ్యక్షులు అవ్వారు సత్య గోపాల్ డాంగే అధ్యక్షతన జరిగింది. వయసు రీత్యా ఆరోగ్య కారణాల వల్ల అసోసియేషన్‌కు తన సహకారం అందించలేకపోతున్నానని, తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళును అధ్యక్షులుగా తాను ప్రతిపాదన చేస్తున్నానని తెలిపారు. దీంతో సమావే శంలో ఇతర సభ్యులు లక్ష్మీ పెరుమాళ్ళు పేరును ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మంగళగిరి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు, కోశాధికారి నీలి కనకదుర్గ ప్రసాద్, సహాయ కార్యదర్శి మురుగుడు లక్ష్మీనారాయణ, కేంద్ర కమిటీ సభ్యులు అందే వెంకన్న,మంగళగిరి బ్రాంచ్ కోశాధికారి బట్టు నారాయణరావు, సహాయ కార్యదర్శి గోలి మోహన్ రావు, నందం బాబురావు కొల్లి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎలైట్ ఇన్ ఫ్రా తో పేదవాడి సొంతింటి కల సాకారం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** రియల్ ఎస్టేట్ రంగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న ఎలైట్ ఇన్ ఫ్రా తన నూతన ప్రాజెక్ట్ స్కై సిటీ ను ఘనంగా ప్రారంభించింది. ఎలైట్ ఇన్ ఫ్రా నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం పేరేచర్ల సమీపంలో నిర్వహించిన ఎలైట్ ఇన్ ఫ్రా వారి స్కై సిటీ అనే పేరుతో నూతన ప్రాజెక్టు బ్రోచర్ ను తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నా నియోజకవర్గంలో ఇలా అభివృద్ధి జరగడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎలైట్ ఇన్ ఫ్రా ఉంటుందని పేర్కొన్నారు. ఎలైట్ ఇన్ ఫ్రా ప్రతినిధులు కొత్తమాసు నందు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగానే వెంచర్ ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలైట్ ఇన్ ఫ్రా ప్రతినిధులు సకల వెంకటేశ్వర రావు, కె.కృష్ణ మోహన్, మద్ది రామకృష్ణ, చెన్నుపాటి వెంగళరావు, దాది సాంబశివరావు, మోహన్ కృష్ణ, డా.చెరుకూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడులో ఫ్యాక్షన్ సహించం..!

### గుండ్లపాడు పర్యటనలో ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** పల్నాడులో ఫ్యాక్షన్ ను ఎట్టిపరిస్థితిలో సహించబోమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. ఇటీవల ప్రత్యర్థుల చేతిలో హత్యగావించబడిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,దివంగత జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా బొదిలవీడు గ్రామ శివారులో హత్య జరిగిన ప్రదేశాన్ని ఎంపీ సందర్శించారు. హత్య జరిగిన విధానాన్ని ఎమ్మెల్యే జూలకంటి ఎంపీకి వివరించారు. అనంతరం దివంగత జెవిశెట్టి వెంకటేశ్వర్ల, కోటేశ్వరరావు గృహాలకు వెళ్లి.., వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి.., అన్నీ విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జెవిశెట్టి సోదర్ల కుటుంబాల చేస్తున్న ఆర్తనాదలు తనను ఎంతగానో కలిచివేస్తోందని ఎంపీ లావు అవేదన వ్యక్తం చేశారు. త్వరలో చంద్రబాబుతో జెవిశెట్టి కుటుంబ సభ్యులకు భేటీ ఏర్పాటు చేసి.., బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఉద్యోగం, పక్కా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు తమవంతు సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**పల్లెల్లో చిచ్చుపెడితే ఖబడ్దార్..!**

మాచర్ల నియోజకవర్గంలోని పచ్చని పల్లెల్లో చిచ్చు రాజేయ్యాలని చూస్తే ఖబడ్దార్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. జెవిశెట్టి సోదర్ల హత్యలకు చట్టప్రకారం శిక్షలు పడేవరకు పోరాడతామని ఆయన చెప్పారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉండటమేకాకుండా, సమాజక భరోసా కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అరాచక శక్తులు వెన్నుతట్టే జగన్ రెడ్డి.., వారికి ఏదో అన్యాయం జరుగుతోందని ధర్నాలు చేయడం హాస్యస్పందంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పరిశ్రమలు, పెట్టుబడులు గురించి ఆలోచిస్తుంటే..మరోవైపు జగన్ రెడ్డి ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చురేపుతున్నారని విమర్శించారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పరిశ్రమల అభివృద్ధి






- కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పియూష గోయల్ వెల్లడి
- టుబాకో బోర్డ్ సమావేశంలో పాల్గొన్న మంత్రి
- రాష్ట్రంలో 1.6 కోట్ల మందికి ప్రయోజనం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్రంలోని పరిశ్రమల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహం, కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న మూడు పారిశ్రామిక కారిడార్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చ మంచిగా జరిగిందని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఆదివారం స్థానిక టుబాకో బోర్డు కార్యాలయంలోని సమావేశ మందిరంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, అహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ సెక్రటరీ యువరాజ్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ విశ్వశ్రీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, ఎన్ఐడీ అఫీషల్ డైరక్టర్ డా. ఎన్ తేజ్ లోహిత్ రెడ్డి, శాసన సభ్యులు గళ్ళా మాధవి, నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర , డీసీఎంఎస్ చైర్మన్ వడ్రణం హరిబాబు , డిప్యూటీ మేయర్ సజీలా తో కలసి నేషనల్ ఇండస్ట్రీయల్ కారిడార్ డెవల్మేంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ), టుబాకో బోర్డు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశం అనంతరం కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.6 కోట్ల కుటుంబాల అదాయం పెరిగేలా రాష్ట్రంలో వివిధ రంగాలకు మౌలిక సౌకర్యాల కల్పన, టూరిజం, డిఫెన్స్, ఎరోస్పెస్, కెమికల్స్ వంటి వైవిధ్యమైన పరిశ్రమల అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విస్తృత స్థాయిలో చర్చించటం జరిగిందన్నారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న మూడు పారిశ్రామిక పార్కుల పనుల పురోగతిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి మంత్రి టీజీ భరత్, రాష్ట్రంలోని ఇతర ముఖ్య నాయకులతో చర్చించటం జరిగిందన్నారు. పరిశ్రమల కారిడర్లలో పారిశ్రామిక వేత్తలను ఆకర్షించేలా మౌలిక సౌకర్యాలను పూర్తి చేసి పరిశ్రమలను ఏర్పాటు చేయించి రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా రానున్న వారం రోజుల్లోనే కృష్ణపట్నం ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి ఈపీసీ కాంట్రాక్టర్ల ఎంపిక చేస్తున్నామని, అదే విధంగా ఇతర రెండు పారిశ్రామిక నోడ్ ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా టుబాకో బోర్డు పనితీరుపై సమీక్షించటం జరిగిందని, గత నాలుగు సంవత్సరాలుగా టుబాకో బోర్డు పనితీరు చాలా బాగుందని, రైతుల అదాయం రెండింతలు పెరిగిందన్నారు. ఎగుమతులు సైతం రెండు రెట్లు పెరిగాయన్నారు. బోర్డు నిర్దేశిత లక్ష్యాలకు అదనంగా పోగాకు సాగు వలన ఇబ్బందులు వస్తున్నాయని, దీని వలన ధరలు తగ్గిపోతున్నాయన్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన లక్ష్యానికి అదనంగా పొగాకు సాగు చేయకుండా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని పోగాకు బోర్డు అధికారులకు సూచించటం జరిగిదందన్నారు. దీనితో పాటు పొగాకు రైతుల పిల్లలకు అత్యున్నత స్థాయి జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలలో నీట్, జెఈఈ ద్వారా మెడికల్, ఇంజనీరంగ్ లలో విద్యను అభ్యసించేందుకు గా ప్రస్తుతం ఇస్తున్న వడ్డీలేని విద్యా రుణం ను రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచటానికి బోర్డులో నిర్ణయం తీసుకున్నామన్నారు. రుణం తిరిగి చెల్లింపు సమయాన్ని మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలకు పెంచటం జరిగిందన్నారు. పొగాకు రైతుల పిల్లలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నైపుణ్యాలు అభివృద్ధికి, జపానీస్, జర్మన్ , ఫ్రెంచ్, స్పానీష్ భాషలు నెర్పించటానికి రాయితీతో నైపుణ్య శిక్షణ కేంద్రాలు పొగాకు బోర్డు ద్వారా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొదించాలని దిశా నిర్దేశం చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో అధ్భుతమైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ క్యాంపస్ ఉందని, భవిష్యత్ లో ఇది సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా రూపుదిద్దుకుంటుందని ఖచ్చితమైన నమ్మకం ఉందన్నారు. తొలుత టుబాకో బోర్డు కార్యాలయం వద్ద కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ కు కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, అహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ విశ్వశ్రీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, శాసనసభ్యులు గళ్ళా మాధవి, నగరపాలక సంస్థ మేయరు కొవెలమూడి రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రణం హరిబాబు, డిప్యూటీ మేయరు సజీలా పుష్ప గుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం అందించారు.

## తల్లికి వందనం పథకంపై అసత్య ప్రచారం తగదు : కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** తల్లికి వందనం పథకంపై వైఎస్సార్ సీపీ నేతల అసత్య ప్రచారం తగదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు.మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గత కొన్ని రోజులుగా తల్లికి వందనం పథకం అమలుపై అనేక రకాలుగా బురదజల్లుతున్నారు. ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ఎన్డీయే కూటమి పక్షాన చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధితో, నిజాయితీగా ఎంతమంది బిడ్డలుంటే అంతమందికి రూ. 15 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తల్లికి వందనం అమలుకు జూన్ 12 వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ లు శ్రీకారం చుట్టారు. రూ.10,090 కోట్లకు పైగా నిధులు విడుదల చేశారు. 67,27,164 మంది బిడ్డలకు తల్లికి వందనం పథకం అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. అయినా వైసీపీ నాయకులు నిస్సిగ్గుగా దానిపై బురద జల్లుతున్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం కొంత నిధులు జమచేస్తుంటే ఆ డబ్బులు నారా లోకేష్ అకౌంట్లోకి వెళ్లాయని అకారణంగా బురదజల్లే కార్యక్రమం చేపట్టారు. ఆధారాలతో రుజువు చేయండి, రుజువు చేయలేకపోతే బహిరంగ క్షమాపణ కోరాలని, కోరకపోతే చట్టపరమైన చర్యలుంటాయని నారా లోకేష్ సవాల్ విసిరారు. ఇప్పటి వరకు ఎవరూ సవాల్ ను స్వీకరించలేదు. దీంతో వారికి దమ్ము, ధైర్యం లేదని రుజువైంది. ఇచ్చిన సమయం ముగిసింది. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఉండాలి. లోకేష్ విసిరిన సవాల్‌ని స్వీకరించకుండా బులుగు ముఠా దాక్కున్నారు. జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్, బెంగళూరు ప్యాలెస్, ఇడుపులపాయి ప్యాలెస్ లలో ఎక్కడ దాక్కున్నారో తెలియదు. జగన్ చివరి విడత అంటే 2023 జులైలో అమ్మఒడి పథకానికి 6,393 కోట్లకు జీవో ఇచ్చి 853 కోట్లు మెయింటెనెన్స్ కు తీసుకొని (ఆ డబ్బులు ఎటు పోయాయో తెలియదు) కేవలం రూ.5,540 కోట్లు తల్లుల ఖాతాల్లో వేశాడు. కానీ మన చంద్రన్న ప్రభుత్వం మొన్న జూన్ 12న తల్లికి వందనం పథకానికి రూ.10,090 కోట్లు విడుదల చేసి దానిలో స్కూల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కి 1345 కోట్లు జిల్లా కలెక్టర్ల అకౌంట్ లలో వేయడం జరిగింది. 8745 కోట్లు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది అంటే గతంలో జగన్ రెడ్డి ఇచ్చినదానికంటే ఒకే సారి 58 శాతం పెంచి 3,205 కోట్లు అదనంగా, 8,745 కోట్ల రూపాయలు నేడు తల్లుల ఖాతాల్లో జమచేసి 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ది చేకూర్చడం జరిగింది. జగన్ లాగ ప్రతి యేడాది కటింగ్ లు పెట్టలేదు. కోతలు పెట్టటం, మోసం చేయడం మాకు చేతకాదు. దీనికి పేటియం బ్యాచ్ సమాధానం చెప్పాలి. ఒక్కరే సంతానం కలిగిన 18.55 లక్షల మంది తల్లులు, ఇద్దరు పిల్లలు కలిగిన 14.55 లక్షల మంది తల్లులకు,, ముగ్గురు పిల్లలున్న 2.10 లక్షల మంది తల్లులకు, నలుగురు పిల్లలు కలిగిన 20 వేల మంది తల్లులుకు నేడు లబ్ది చేకూర్చి వారి చిరునవ్వుకు కారకులయ్యాము. ప్రజలు సంతోషంగా ఉంటే జగన్‌కు పట్టదు. అందుకే జగన్ ను సైకో జగన్ అంటారు. నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషించి ఉంటే నేడు ప్రభుత్వాన్ని ప్రశంసించివుండేవాడివి. మీరింకా మెరుగ్గా చేస్తున్నారని మెచ్చుకునేవాడివి. ఇంకా బాగా చేయండని ప్రోత్సహించేవాడివి. హుందాతనం జగన్ డిఎన్ ఏలోనే లేదు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలు గ్రహించాలని పట్టాభిరామ్ తెలిపారు.




# ఏ.పి & తెలంగాణా ప్రభుత్వాలు
# జాబ్ కేలండర్ విషయం ఏంటి?

**చెప్పటానికి చేయడానికి చాలా తేడా ఉంటుంది. ఇన్‌స్టంట్ ప్రయోజనాలనాశించి చెప్పేస్తారు. తీరా ప్రయోజనాలు పొందిన తర్వాత చేయడానికి నత్తనడకను అనుసరిస్తారు. నిరుద్యోగ నిర్మూలన అనేది ఎన్నికల మానిఫెస్టోలలో ఎవర్‌గ్రీన్ విషయం. ఇది ఎప్పుడూ రాజకీయ నాయకుల ప్రసంగాలలో నానుతూ ఉండాలి. తీరా గెలిచిన తరువాత నిరుద్యోగ నిర్మూలన కాస్తా చివరి ఆప్షన్ అవుతుంది.**

ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తాము గెలిచిన తరువాత బోలెడన్ని ఉద్యోగాలతో కేలండర్‌లు అన్నారు. మొదటి ప్రయారిటీ అన్నారు. గెలిచిన తరువాత సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాల కేలండర్ కొరకు నిరీక్షణలు, పోరాటాలు తప్పడం లేదు. ప్రభుత్వాలు అనేవి ఏ పార్టీల నుండైనా రానీయండి. అన్ని ప్రభుత్వాల వైఖరి ఒక్కటే. వర్షం అనేది అదనులో పదునుగా కురవాలి. అదను తప్పిన తరువాత పడే వర్షం సముద్రం పాలవుతుంది. మనకు ఉపయోగపడదు. ఉద్యోగార్థులకు కూడా ఒక సర్టెన్ పిరియడ్ ఉంటుంది. ఆ తరువాత వారి వయసులు దాటిపోతాయి. ఇది ప్రభుత్వాలు గమనించాలి.

**తెలంగాణ**

తెలంగాణలో ఇంచుమించుగా గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు అన్నింటికి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చేసారు. మరికొన్ని రిక్రూట్‌మెంట్ తుదిదశలో ఉన్నాయి. తదుపరి సుమారు 27వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు రానున్నాయని సమాచారం. అలానే గ్రూప్-4 మరియు గ్రూప్-3 కలిపి ఒకటే రిక్రూట్‌మెంట్ చేయాలనేది తెలంగాణా ప్రభుత్వ ఆలోచనలా ఉన్నది. ఉద్యోగ ఖాళీల వివరాల సేకరణలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కావస్తున్నా స్పష్టమైన జాబ్ కేలండర్ ప్రకటించడం లేదని నిరుద్యోగులు ఆందోళనలు గట్టిగానే చేస్తున్నారు. నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నప్పుడల్లా ముఖ్యమంత్రిగారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్పందిస్తున్నారు. ఆంధ్రాలో అయితే ఈ ముచ్చటే లేదు.

తెలంగాణాలో వెనకా ముందు అయినా ఖచ్చితంగా ఉద్యోగ ప్రకటనలు వస్తాయి. అవి కేలండర్ రూపంలో ఉంటే మంచిది. ఫలానా టైమ్‌లో నోటిఫికేషన్ వస్తుంది - పరీక్ష జరుగుతుంది - ఫలితాలు వస్తాయి - ఉద్యోగాలొస్తాయి అన్నదానిలో స్పష్టత ఉంటే యువత సివిల్స్ లాగా కుదురుగా కూర్చొని చదవటానికి అవకాశం ఉంటుంది. అలా కాక ఉద్యోగ ప్రకటనలు వస్తాయి.... వస్తాయి... ఎప్పుడొస్తాయి? అనే ఆకాశగంగ సిద్ధాంతం ఉంటే ఉద్యోగార్థులకు విలువైన కాలహరణం అవుతుంది.

**ఆంధ్రప్రదేశ్ - జనవరిలో కేలండర్....?**

**ప్రభుత్వాలు ఉద్యోగాల ప్రకటనల పట్ల ఉద్యోగార్థుల్లో విశ్వసనీయత కల్పించాలి. ఎన్నికలపుడే నోటిఫికేషన్లు అనే ఒక చెడ్డ సంప్రదాయాన్ని వదిలేయాలి. ఏ సంవత్సరానికా సంవత్సరం ఉన్నన్ని ఖాళీలతో నోటిఫికేషన్లు ఇవ్వాలి. వీటిని ముందుగానే కేలండరు రూపంలో ప్రకటించాలి. ఫలానా టైమ్‌లో నోటిఫికేషన్ వస్తుంది, పరీక్ష జరుగుతుంది, ఫలితాలు వస్తాయి, ఉద్యోగాలొస్తాయి అన్నదానిలో స్పష్టత ఉంటే యువత సివిల్స్ లాగా కుదురుగా కూర్చొని చదవటానికి అవకాశం ఉంటుంది.**



ఆంధ్రప్రదేశ్‌లో కూడా గత ప్రభుత్వం ఇచ్చిన అనేక ఉద్యోగ ప్రకటనలకు పరీక్షలు జరుగుతున్నాయి. ప్రస్తుతం యువత డిఎస్సీ పరీక్షలు రాస్తున్నారు. ఇవన్నీ జులై నెల వరకు ఒక కొలిక్కి తెచ్చి వచ్చే జనవరికి నూతన జాబ్ కేలండర్ ఇచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే గ్రూప్-1 150పోస్టులు మరియు ఎండోమెంట్ 137 పోస్టులు, ఇంకా గ్రూప్-2 కి సంబంధించి రెవిన్యూ పోస్టులు... ఇలా ఎన్నో రాబోయే కేలండర్‌లో ప్రకటిస్తారని ఉద్యోగార్థులు ఆశిస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్‌గారు గతంలో చేసిన యువగళం యాత్రలో ఇచ్చిన ప్రధాన హామీ ఉద్యోగాల కేలండర్ ప్రకటిస్తామనేది.

అయితే ప్రభుత్వం వచ్చి ఇటీవలే ఒక సంవత్సరం సెలబ్రేషన్స్ జరిగాయి. ఆరువేల ఉద్యోగాలకి పైబడి కానిస్టేబుల్, మెయిన్స్ పరీక్షలు ఇటీవల నిర్వహించారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఒక ఖచ్చితమైన కన్‌సర్న్ ఉన్నది అని అర్థం అవుతున్నది. అయితే సాధ్యమయినంత త్వరగా జాబ్ కేలండర్ విడుదల చేయాలని, ప్రక్రియ మొత్తం ఒక సంవత్సరంలో పూర్తి చేయాలని యువత కోరుతున్నారు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం కేలండర్ రూపంలోనే ఉద్యోగాల ప్రకటన వచ్చే జనవరికి ఉండవచ్చు. ప్రస్తుతం గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియ వేగంగానే జరుగుతున్నది.

**నమ్మకం కలిగించాలి :-**

ప్రభుత్వాలు ఉద్యోగాల ప్రకటనల పట్ల ఉద్యోగార్థుల్లో విశ్వసనీయత కల్పించాలి. ఈ విశ్వసనీయత ఉద్యోగ ప్రకటనలు వెలువడినప్పటినుండి రిక్రూట్‌మెంట్ పూర్తయ్యేవరకు చూపగలగాలి. సంవత్సరాలకు సంవత్సరాలు ఉద్యోగాల ప్రకటనలకు వేచి చూడాలి అంటే అంత నిగ్రహం, ఓర్పు యువతకు ఉండవు. ఇలా వేచి చూసే పద్ధతి కూడా మంచిది కాదు. ఒక వన్ ఇయర్ ఓకే, సరే రెండు సంవత్సరాలు. కానీ పంచవర్ష ప్రణాళికలాగా ఐదేసి సంవత్సరాలు పడితే అసలు ఆశే చచ్చిపోతుంది. గొప్ప గొప్ప చదువులు చదివి కూడా పదివేలకు, పదిహేను వేలకు ఉద్యోగాలు చేసుకుంటూ కనీస జీవన ప్రమాణాలు లేకుండా పోతాయి. శక్తియుక్తులుండి కూడా ప్రభుత్వ పథకాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఎ.పి.లో పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం పరిఢవిల్లాలని అనే కార్యక్రమం (3-పి) జరుగుతోంది. దీనివల్ల ఉద్యోగాలు వస్తాయి. కానీ ఆ ఉద్యోగాలలో ఇచ్చే జీతాలు జీవన ప్రమాణాలను మార్చబడవు. సంవత్సరానికి ఒకసారి, క్రితం సంవత్సరం ఖాళీ అయిన ఉద్యోగాలకు (ఎన్ని ఉంటే అన్ని) ప్రకటనలు ఇస్తే ఇష్టం ఉన్నవారు స్పందిస్తారు. లేకపోతే లేదు. ప్రభుత్వాలు ఈ ఒక్కపని చేస్తే చాలు. కేలండర్ ఇస్తే చాలు. ఎవరయితే కష్టపడి చదువుకుంటారో వాళ్ళకి ఉద్యోగాలు వచ్చేస్తాయి. రాని వాళ్ళు వేరే ఆప్షన్స్ చూసుకుంటారు. ప్రభుత్వంపై ఒత్తిడి ఉండదు.

ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చిన్న లాజిక్ మిస్సవుతున్నాయి. ఎన్నికలపుడే నోటిఫికేషన్లు అనే ఒక చెడ్డ సంప్రదాయాన్ని వదిలేయాలి. ఏ సంవత్సరానికా సంవత్సరం ఉన్నన్ని ఖాళీలతో నోటిఫికేషన్లు ఇస్తే ప్రభుత్వ బాధ్యత తీరుతుంది. అది కూడా కేలండర్ రూపంలో ఉంటే విశ్వసనీయత పెరుగుతుంది. మనదేశంలోని కొన్ని రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు ఆల్రెడీ కేలండర్‌ల ప్రకటనలు జారీ చేస్తూ రిక్రూట్ చేస్తున్నాయి. ఈ బాటలో మన ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎందుకు ప్రయత్నించకూడదు? దీనికి కావల్సిందల్లా ప్రభుత్వాల్లో గట్టి చిత్తశుద్ధి.



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

# వీక్లీ రౌండప్

## అంతర్జాతీయం

**జూన్ 2 - జూన్ 8**

- కెనడాలో జరుగనున్న జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీమోదీని కెనడా ప్రధాని ఆహ్వానించారు.
- బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆ దేశ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పేరును తొలగించింది
- దక్షిణ కొరియాలో జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో లిబరల్ పార్టీ అభ్యర్థి లీజే-మ్యుంగ్ 85 శాతానికిపైగా ఓట్లతో ఘన విజయం సాధించారు
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంగోలియా ప్రధాని ఓయున్ ఎర్డెన్ పదవికి రాజీనామా చేశారు.
- ఇటలీలోని సిసిలీలో మంచుతో కప్పబడిన 'మౌంట్ ఎట్నా' అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది.
- హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సొంతం చేసుకున్నారు.
- ఉక్రెయిన్ చేపట్టిన 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్'కు ప్రతీకారంగా ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలపై రష్యా సేనలు 400కు పైగా డ్రోన్లు, 40కి పైగా క్షిపణులను ప్రయోగించాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించారు.
- కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్నవేళ, వైరస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా పరిశోధకులు 'ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్'ను అభివృద్ధి చేశారు.
- భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగబోయే టెస్టు సిరీస్‌లలో విజేతకు ఇచ్చే ట్రోఫీ పేరు ఇక నుంచి టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీగా మారనుంది.
- ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను అమెరికా యువ సంచలనం కోకో గాఫ్ గెలుచుకుంది.

## జాతీయం

**జూన్ 2 - జూన్ 8**

- జమ్ము-శ్రీనగర్‌ను అనుసంధానం చేసేందుకు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సింగిల్ ఆర్చ్ రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.
- ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
- అమర్‌నాథ్ యాత్రను ఈ ఏడాది జూలై 3 నుంచి ఆగస్టు 9 వరకు కేవలం 38 రోజులు మాత్రమే నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.
- బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్‌సీబీ విజయోత్సవ సంబరంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందారు.
- త్రివిధ దళాలకు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను ప్రదానం చేశారు.
- బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లను ఆగస్టు 14లోపు ముగించాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది
- అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో ఆర్‌సీబీ.. ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. 18 ఏండ్ల విరామం తర్వాత జూన్ 3, 2025న ఆర్‌సీబీ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రూ.20 కోట్ల ప్రైజ్ మనీని, రన్నరప్ పంజాబ్ కింగ్స్‌కు రూ. 12.5 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

ఫెయిర్ ప్లే అవార్డు (చెన్నై సూపర్ కింగ్స్) రూ.10లక్షలు
ప్రసిద్ధ్ కృష్ణ (పర్పుల్ క్యాప్) రూ.10లక్షలు
సాయి సుదర్శన్ (ఆరెంజ్ క్యాప్) రూ.10లక్షలు
సూర్యకుమార్ యాదవ్ (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్) రూ.15లక్షలు.

# 18న రెంటపాళ్ళకు మాజీ సీఎం వైఎస్ జగన్..

**రెంటపాళ్లలో వైసీపీ ముఖ్య నాయకులు పర్యటన**



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో ఈ నెల 18 న ఉప సర్పంచ్ కొర్లకుంట శివ నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు హాజరుకానున్నారు. కావున పల్నాడు జిల్లా వైకాపా నాయకులు ఆదివారం రెంటపాళ్ళ గ్రామంలో విగ్రహ ఆవిష్కరణ ప్రాంతాన్ని పరిశీలించి, సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కొర్లకుంట వెంకటేశ్వర్లు నివాసంలో సమావేశం ఏర్పాటు చేసి విగ్రహావిష్కరణ కు చేయనున్న ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి,పలు సూచనలు చేశారు. కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో హాజరుకానున్న నేపద్యంలో తగు ఏర్పాట్ల భాద్యతలు నియోజకవర్గ నాయకులకు అప్పగించారు. సమిష్టి కృషితో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా వైకాపా నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరవుతున్నట్లు సమాచారం. ఈ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుదీర్ భార్గవరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రులు విడుదల రజిని, పేర్ని నాని, మాజీ శాసనసభ్యులు, గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాసు మహేష్ రెడ్డి, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తం రావు, ముప్పాళ్ల మండల పార్టీ అధ్యక్షులు నక్కశ్రీను, రాజుపాలెం మండల అధ్యక్షులు ఏపూరి శ్రీనివాసరావు, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షులు భవనం రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంద విభాగాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి కేడరే..
- తల్లికి వందనం గురించి వివరించి చెప్పండి
- పార్టీ వివిధ స్థాయి నాయకులతో ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూటీ**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధిగా నిలవాలని, గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ వివిధ స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంతమంది ఉన్నా కేవలం ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి పథకం అమలు చేసేవారని, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఈ పథకాన్ని వర్తింప చేశారని తెలిపారు. దీని ద్వారా ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబంలో రూ. 39 వేల రూపాయలు నగదు జమయ్యాయని, పిల్లల



చదువులకి తల్లిదండ్రులకు ఎలాంటి ఢోకా లేకుండా పోయిందని తెలిపారు. తల్లికి వందనంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత నాయకులదేనన్నారు. పది నెలల కాలంలో రాష్ట్రంలో పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు అమలు చేశామని, వీటన్నింటి గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు నాయకులకు ఏ కష్టం వచ్చినా తాను ముందుండి నిలబడతానని, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి పనిచేసే వారికే తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందని, ఈ విషయాన్ని అధిష్టానం మాటగా చెబుతున్నారని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం వివరించారు.

# మెగా యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

- నగర కమిషనర్ పిలుపు
- నేడు గాంధీ పార్క్‌లో యోగ కార్యక్రమం

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, సోమవారం గాంధీ పార్క్ లో నిర్వహించనున్నమెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని గాంధీ పార్క్ లో ఈ నెల 16 వ తేదీ (సోమవారం) ఉదయం 6 గంటలకు మెగా యోగా కార్యక్రమ ఏర్పాట్లను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారులు కలిసి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో గుంటూరు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనెలా వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్గించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా



మన్నారు. యోగా పట్ల ప్రజల్లో మరింతగా అవగాహన కల్గించడం కోసం జూన్ 16 సోమవారం రోజున గాంధీ పార్క్ లో ఉదయం 6 గంటలకు జరిగే యోగా కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు. నగరంలోని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా శిక్షకులు, అభ్యాసకులు, సీనియర్ సిటిజన్లు, స్టేక్ హోల్డర్స్ ఈ కార్యక్రమానికి హాజరగుతారని, కావున దానికి తగిన విధంగా గాంధీ పార్క్ నందు ఏర్పాట్లను చేయుటకు పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్యాదికారులు యోగా జరిగే ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇంజనీరింగ్ అధికారులు అవసరమైన మైక్ సిస్టం, గ్రీన్ మ్యాట్ మరియు త్రాగు నీరు వంటి సదుపాయాలూ ఏర్పాటు చేయాలన్నారు. నగర ప్రజలు కూడా ఈ యోగా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సి. హెచ్ శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, ఈ.ఈ సుందర రామి రెడ్డి, డి.ఈ.ఈ హనీఫ్, ప్రజారోగ్యాదికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయిలో చేనేత గుర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి





**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్**

**మంగళగిరి, మేజర్ న్యూస్:** ప్రపంచ స్థాయిలో చేనేతకు తగిన గుర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరు జిల్లా మంగళగిరి జాతీయ రహదారి వెంబడి తెనాలి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సీఎన్ఆర్ హ్యాండ్లూమ్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్మికులు, సిబ్బందితో సరదాగా ముచ్చటించి మగ్గంపై చీరను నేశారు. ఈ సందర్భంగా సీఎన్ఆర్ హ్యాండ్లూమ్స్ లోని పట్టు, కాటన్ వస్త్రాలు, ఇతర డ్రెస్ మెటీరియల్స్ తయారీ, పద్ధతులు, నాణ్యత, నిర్వహణ గురించి సీఎన్ఆర్ హ్యాండ్లూమ్స్ యజమాని, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి చేనేత రంగం ఒక మూల స్తంభంగా అభివర్ణిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల చేనేత రంగం ప్రగతి పథంలో సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో 'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777